

ముత్యాలమ్మకు వెండి వడ్డాణం


అమలాపురం రూరల్: రోళ్లపాలెం గ్రామ దేవత ముత్యాలమ్మకు సర్పంచ్ మట్ట వైదేహి, సాయి రామారావు దంపతులు ఆదివారం రూ.47 వేల వెండి వడ్డాణం సమర్పించారు.



దూసుకొచ్చిన మృత్యువు

జాతీయ రహదారిపై వెళుతున్న కారు, ఆటోపైకి ఖాళీ గ్యాస్ సిలిండర్ల లోడు లారీ దూసుకుపోవడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. - 8లో▸

సముద్రంలోకి 3,149 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులకు చేరడంతో ఆదివారం 3,149 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ ధవళేశ్వరం ఆర్మ్‌లోని ఐదు గేట్లను పైకి లేపి మిగులు జలాలు వదులుతున్నారు. ఈ వేసవిలో మిగులు జలాల విడుదల ఇదే ప్రథమం.

న్యూస్‌రీల్

నర్సరీని సందర్శించిన శాస్త్రవేత్తలు



సత్యదేవ నర్సరీలో శాస్త్రవేత్తలు

కడియం: కడియపులంక శ్రీ సత్యదేవ నర్సరీని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చికి చెందిన శాస్త్రవేత్తల బృందం ఆదివారం సందర్శించింది. ఈ బృందంలో 24 రాష్ట్రాలకు చెందిన 117 మంది శాస్త్రవేత్తలు ఉన్నారు. నర్సరీల్లో అభివృద్ధి చేస్తున్న స్వదేశీ, విదేశాలకు చెందిన వివిధ రకాల మొక్కలు, నర్సరీ యాజమాన్య పద్ధతుల గురించి నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు వీరికి వివరించారు. రైతులు పుల్లా వీరబాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: తమ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సూక్ష్మసేద్య అధికారి ఎస్.రామ్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ (అగ్రికల్చర్ ఇంజినీరింగ్) చదివి, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. దరఖాస్తుతో పాటు పదో తరగతి, ఇతర విద్యార్హతల మార్కుల జాబితాలు, కులధ్రువీకరణ పత్రాలను విధిగా జత చేసి, తమ కార్యాలయం ఈ–మెయిల్ dmioeg1@gmail.com కు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పంపించాలన్నారు. అలాగే అర్హులైన వారికి ఈ నెల 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు తమ కార్యాలయం వద్ద మౌఖిక పరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు 7995 00 9878 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ఈస్ట్‌జోన్ డీఎస్పీగా కిశోర్ కుమార్



కిశోర్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: మార్కాపురం డీఎస్పీగా పని చేస్తున్న డాక్టర్ ఎం.కిశోర్ కుమార్‌ను రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీగా ప్రభుత్వం నియమించింది. ఆయనను తొలుత అమలాపురం డీఎస్పీగా బదిలీ చేశారు. అయితే అక్కడ చేరకముందే ఈస్ట్‌జోన్ డీఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీగా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ భక్తవత్సలం వ్యవహరిస్తున్నారు.

జిల్లాలో 8.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం 8 గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో 8.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా గోకవరంలో 39 మిల్లీమీటర్లు నమోదైంది. సీతానగరంలో 10.2, కోరుకొండ 28.4, తాళ్లపూడి 22.6, రంగంపేట 26.4, చాగల్లు 11.4, రాజానగరం 8.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని అధికారులు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్, బిక్కవోలు, అనపర్తి, పెరవలి మండలాల్లో ఒక మోస్తరు జల్లులు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో ఉదయం నుంచి, కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి తీవ్రంగా ఎండ కాసింది. రాత్రి 7 గంటల నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈదురుగాలులు వీచాయి. ఆకాశం మేఘావృతమైంది. పలు మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. కొన్నిచోట్ల మోస్తరు వర్షం కురిసింది.

నిత్యాన్నదానానికి విరాళాల వెల్లువ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరాళాలు వెల్లువలా వస్తున్నాయి. ఈ విషయాన్ని ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. గొల్లపూడికి చెందిన డి.శ్రీనివాసరావు, ఉమా చౌదరి దంపతులు రూ.15,116, ఏలూరుకు చెందిన బి.బంగార్రాజు, విజయదుర్గ దంపతులు రూ.11,116, మండపేటకు చెందిన కె.నాగమోహిత్ రూ.10,116, జంగారెడ్డిగూడేనికి చెందిన టి.వీరభద్ర అప్పల రామ్మోహన రావు రూ.10,116, రాజమహేంద్రవరానికి చెందిన కేవీఎస్ఎన్ మూర్తి, లాస్య ప్రియ దంపతులు రూ.10,116, హైదరాబాద్‌కు చెందిన జి.సత్యనారాయణ, లక్ష్మి దంపతులు రూ.11,992, తునికి చెందిన ఎస్.శ్రీనివాస్ రూ.10,116 విరాళాలు అందించినట్లు వివరించారు. దాతలకు ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం బహూకరించారు.

సర్కారీ స్కూళ్ల సత్తా

- ప్రభుత్వ చర్యలతో పదింతల ప్రోత్సాహం
- టెన్త్‌లో టాపర్లుగా నిలిచిన పేద విద్యార్థులు
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



నాన్నకు ప్రేమతో.. (విజయం సాధించిన ఆనందాన్ని తల్లిదండ్రులతో పంచుకుంటున్న జ్యోత్స్న, రమణక్కపేట, యు.కొత్తపల్లి మండలం)

సాక్షి ప్రతినిధి, కాకినాడ/నెట్‌వర్క్: విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులతో కలిగిన ప్రయోజనం పదో తరగతి ఫలితాల్లో ప్రస్ఫుటమైంది. కార్పొరేట్ బడులకు దీటుగా సర్కారీ స్కూళ్ల విద్యార్థులు మెరుపులు మెరిపించారు. అనేక పాఠశాలలు నూరు శాతం ఫలితాలు సాధించి, విజయకేతనం ఎగురవేశాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థికి 500 మార్కులు వచ్చాయంటే ఒకప్పుడు గొప్పగా చెప్పుకునే వారు. అటువంటిది ఈసారి పదో తరగతి ఫలితాల్లో 550 నుంచి దాదాపు 590 వరకూ మార్కులను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో సర్కారీ పాఠశాలలు సాధిస్తున్న ప్రగతికి ఈ మార్కులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ ఫలితాలు ప్రభుత్వ పాఠశాలలపై ఇప్పటి వరకూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఉన్న వ్యతిరేక భావాన్ని చెరిపేశాయని చెప్పవచ్చు.

29 పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత

కాకినాడ జిల్లాలో 247 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలుండగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించినవి 29 ఉన్నాయి. మరో 15 పాఠశాలలు 80 నుంచి 90 శాతం ఉత్తీర్ణత సాధించాయి. తొమ్మిది సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు 85.60 శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. పి.వెంకటాపురం గురుకుల పాఠశాల విద్యార్థిని దడాల జ్యోత్స్న (రమణక్కపేట, యు.కొత్తపల్లి మండలం) అత్యధికంగా 589 మార్కులు సాధించగా, 23 మంది విద్యార్థులు 575 పైగా మార్కులు పొందారు. 575 నుంచి 572 మార్కులు సాధించిన వారు 11 మంది ఉన్నారు.

తూర్పు గోదావరిలో..

జిల్లాలో 348 ఉన్నత పాఠశాలలకు గాను రెండు స్కూళ్లు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. భూపాలపట్నం ఏపీ రెసిడెన్షియల్ హైస్కూల్‌లో 72 మంది పరీక్షలు రాస్తే అందరూ ఉత్తీర్ణులయ్యారు. అలాగే కొవ్వూరు మండలం వాడపల్లి ఎంజేపీ ఏపీ బీసీ వెల్ఫేర్ స్కూల్లో ఏడుగురు విద్యార్థులు పరీక్షలు రాయగా నూరు శాతం ఉత్తీర్ణత నమోదైంది. కొవ్వూరు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 91కి 86 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో 15 ప్రభుత్వ పాఠశాలలు 80 నుంచి 90 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. బిక్కవోలు మండలం పందలపాక జెడ్పీ హైస్కూలు విద్యార్థి మాడెం డీవీ గణేష్ కుమార్ అత్యధికంగా 589 మార్కులు సాధించాడు. 575 పైగా మార్కులు సాధించిన వారు 14 మంది, 572 నుంచి 575 మధ్య సాధించిన వారు ఆరుగురు ఉన్నారు.

కోనసీమ జిల్లాలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ - మిగతా 8లో▸



- విద్యార్థి పేరు: మాడెం డీవీ గణేష్ కుమార్
- మార్కులు: 589
- తల్లిదండ్రులు: తండ్రి శివ ప్రసాద్, వ్యవసాయ కూలీ, తల్లి గృహిణి
- పాఠశాల: పందలపాక జెడ్పీ హైస్కూలు, బిక్కవోలు మండలం
- విద్యార్థి లక్ష్యం: సివిల్స్



- విద్యార్థి పేరు: దడాల జ్యోత్స్న
- మార్కులు: 589
- తల్లిదండ్రులు: శాంతి, సింహాచలం వ్యవసాయ కూలీ
- పాఠశాల: పి.వెంకటాపురం గురుకుల పాఠశాల
- విద్యార్థి లక్ష్యం: డాక్టర్



- విద్యార్థి పేరు: రెడ్డి హేమ సుందర్ వీరబాబు
- మార్కులు: 588
- తల్లిదండ్రులు: శివకుమారి, వెంకన్న వ్యవసాయ కూలీ. తల్లి గృహిణి
- పాఠశాల: కుమారప్రియం, జెడ్పీ హైస్కూలు
- లక్ష్యం: ఇంజినీర్



- విద్యార్థి పేరు: జిగిరెడ్డి తారక్‌స్వామి
- మార్కులు: 587
- తల్లిదండ్రులు: లక్ష్మీమాతాజీ, శ్రీను. వ్యవసాయం
- పాఠశాల: రౌతులపూడి జెడ్పీ హైస్కూల్
- లక్ష్యం: ఉన్నత చదువులు



- విద్యార్థి పేరు: పి.వెంకట నందిని
- మార్కులు: 585
- తండ్రి: రంగబాబు, బ్యాగ్ రిపేర్ వర్క్స్
- పాఠశాల: జెడ్పీ హైస్కూల్, ఎస్.సూరవరం
- విద్యార్థి లక్ష్యం: ప్రభుత్వ ఉద్యోగం



- విద్యార్థి పేరు: నంగన అక్షయ
- మార్కులు: 585
- తల్లిదండ్రులు: కృష్ణవేణి, సత్యనారాయణ తండ్రి రైస్‌మిల్లులో గుమస్తా.. తల్లి అంగన్‌వాడీ టీచర్.
- పాఠశాల: రాజపూడి హైస్కూల్
- విద్యార్థి లక్ష్యం : ట్రిపుల్ ఐటీలో సీటు



- విద్యార్థి పేరు: లంక ఉమాదేవి
- మార్కులు: 584
- తల్లిదండ్రులు: అన్నపూర్ణ, రాంబాబు. తండ్రి లారీ డ్రైవర్
- పాఠశాల: ఏలేశ్వరం ఉన్నత పాఠశాల
- లక్ష్యం: ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్



- విద్యార్థి పేరు: ఎఎస్‌వీ సత్యసూర్య ప్రసాద్
- మార్కులు: 584
- తండ్రి: పెద్దిరాజు వ్యవసాయం
- పాఠశాల: జెడ్పీ హైస్కూలు, ప్రకాశరావుపాలెం
- లక్ష్యం: ట్రిపుల్ ఐటీ



- విద్యార్థి పేరు : ఏఎస్ఎస్‌వీ అనంత శ్రీకర్
- మార్కులు : 583
- తల్లిదండ్రులు: శేష శైలజ, ఏఎస్ రామారావు ప్రైవేట్ స్కూల్ టీచర్
- పాఠశాల: అనపర్తి జెడ్పీ హైస్కూలు
- విద్యార్థి లక్ష్యం: ఐఐటీలో ఇంజినీరింగ్



- విద్యార్థి పేరు : గొల్లపల్లి లక్ష్మీదుర్గ
- మార్కులు: 582
- తల్లిదండ్రులు: తండ్రి చనిపోయారు, తల్లి గృహిణి
- పాఠశాల పేరు: పందూరు జెడ్పీ హైస్కూలు
- విద్యార్థి లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



- విద్యార్థి పేరు: స్వామిరెడ్డి శివగంగా ప్రభాస్
- మార్కులు: 582
- తల్లిదండ్రులు: సముద్రం, వరలక్ష్మి వ్యవసాయం
- పాఠశాల: యండపల్లి జిల్లా పరిషత్ పాఠశాల
- విద్యార్థి లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



- విద్యార్థి పేరు: తలాటం లక్ష్మి
- మార్కులు: 582
- తల్లిదండ్రులు: వెంకటలక్ష్మి, రామకృష్ణ తండ్రి వ్యవసాయ కూలీ, తల్లి గృహిణి
- పాఠశాల: జెడ్పీ హైస్కూల్ చంద్రంపాలెం
- లక్ష్యం: ఇంజినీరింగ్

మొక్కలకూ డాక్టర్!

- ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ కేంద్రాల ఏర్పాటుకు రంగం సిద్ధం
- జిల్లాలో తొలి విడతగా 18 మంది ఎంపిక
- ఆర్‌బీకే నుంచి సేవలు
- ఫ్యామిలీ డాక్టర్ తరహాలో సేవలు



సాక్షి, రాజమహేంద్రవరం: వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికారు. విత్తు నుంచి పంట విక్రయం వరకూ అన్ని దశల్లోనూ అండగా నిలుస్తూ వ్యవసాయాన్ని పండగ చేస్తున్నారు. పంట బాగుండాలంటే ఆరోగ్యకరమైన మొక్కల ఆవశ్యకత ఎంతైనా ఉందని గ్రహించిన ప్రభుత్వం.. మొక్కల సంరక్షణకు ప్రత్యేక వైద్యుడిని నియమిస్తోంది. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద మనుషులకు ప్రభుత్వ వైద్యులు ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. ఇదే తరహాలో 'ప్లాంట్ డాక్టర్' అనే మరో విప్లవాత్మక విధానానికి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా శ్రీకారం చుట్టింది.

వీపీఏలే మొక్కల వైద్యులు

మొక్కలను ఆరోగ్యకరంగా పెంచేందుకు, చీడపీడలు నివారించేందుకు గ్రామ వ్యవసాయ సహాయకుల(వీపీఏ)ను వైద్యులుగా నియమించనున్నారు. వీరు పొలాల్లోకి వెళ్లి మొక్కలకు ఆశించే చీడపీడలను ముందుగా గుర్తిస్తారు. రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను సూచిస్తారు. సలహాలు అందిస్తూ ఆయా పంటల్లో తలెత్తిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళతారు. సమస్య తీవ్రతను బట్టి అధికారులు నేరుగా శాస్త్రవేత్తలను సైతం ఆయా పొలాల్లోకి పంపించేందుకు చర్యలు తీసుకుంటారు.

మండలానికి ఒకరు చొప్పున..

మొక్కల వైద్యుల నియామకానికి వ్యవసాయ శాఖ ఇప్పటికే ప్రణాళికలు రూపొందించింది. తొలి దశలో మండలానికి ఒక ఆర్‌బీకేను ఎంపిక చేసిన ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్ (పీహెచ్‌డీసీ) ఏర్పాటు చేస్తారు. ఆయా మండలాల్లోని ఆర్‌బీకేల్లో అనుభవం ఉన్న వీపీఏను ఎంపిక చేసి, పీహెచ్‌డీసీ డాక్టర్ హోదా కలిస్తారు. అగ్రికల్చర్ ఎమ్మెస్సీ, హార్టికల్చర్ ఎమ్మెస్సీ చదివిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. జిల్లా వ్యాప్తంగా 380 ఆర్‌బీకేలు ఉండగా.. ప్రస్తుతం మండలానికి ఒకటి చొప్పున 18 చోట్ల ప్లాంట్ డాక్టర్లను నియమించనున్నారు. వీరికి జిల్లా కేంద్రంలో శిక్షణ ఇస్తారు. వీరికి సాగు విధానాలపై వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు.

రైతులకు వరం

పీహెచ్‌డీసీలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయి. మొక్కలకు ఆశించే చీడపీడల నివారణకు దోహదం చేస్తాయి. రైతుల పొలాల వద్దకు వీపీఏ వెళ్లి మరీ పంటల సాగు, చీడపీడలు, ఆరోగ్యకరమైన మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తారు. పురుగు మందులకు రైతులు వ్యయప్రయాసలు పడాల్సిన అవసరం తగ్గుతుంది. వీపీఏలకు త్వరలోనే శిక్షణ ఇస్తాం.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి

సులభం.. సౌకర్యవంతం

- ఆర్టీసీ డోర్ టూ డోర్ సేవలు
- షిప్‌మంత్ర యాప్ ద్వారా సరకు రవాణా
- 20 కిలోమీటర్ల పరిధిలో పికప్, డెలివరీ

రాజమహేంద్రవరం సిటీ: ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా సరకుల రవాణా విజయవంతమైన నేపథ్యంలో ప్రజలకు మరింత సులభంగా, సౌకర్యవంతంగా డోర్ టూ డోర్ సేవలు అందించేందుకు ఆ సంస్థ సిద్ధమైంది. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఈ సేవలు అందించనుంది. దీనిలో భాగంగా రాష్ట్రంలోని ఏడు ప్రధాన పట్టణాలను గుర్తించి పైలెట్ ప్రాజెక్టుగా సేవలను ప్రారంభించింది.

సరకు రవాణాలో విజయం

ఆంధ్రప్రదేశ్ రోడ్ రవాణా సంస్థ 2016 జూన్ ఒకటిన సరకు రవాణా సేవలను ప్రారంభించింది. 2021 సెప్టెంబర్‌లో ఒక కేజీ బరువు గల కవర్లు, వస్తువులు మొదలుకుని 10 కేజీల వరకూ పది కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 16 ఆర్టీసీ డిపోల్లో అమలు చేసింది. నెల గడిచేసరికీ పది కేజీల బరువును 50 కేజీలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మనం సరకును తీసుకువెళ్లి రవాణా కార్యాలయంలో అందజేస్తే వారు రవాణా చేసేవారు. అప్పటి నుంచి ఆర్టీసీ రవాణా సేవల్లో వెనుదిరిగి చూడలేదు. పోటీ ప్రపంచంలో ప్రైవేటు రంగాలకు దీటుగా సేవలు అందిస్తూ అనతికాలంలో వినియోగదారులను పెంచుకోగలిగింది. బుకింగ్ చేసిన వస్తువులను 24 గంటల్లోనే రాష్ట్రంలో ఏ ప్రాంతానికైనా చేరవేసేందుకు బృహత్తర ప్రణాళికతో ముందుకు వెళుతోంది.

డోర్ పికప్, డోర్ డెలివరీ సేవలు

తాజాగా ఆర్టీసీ సంస్థ మరో అడుగు ముందుకేసింది. 50 కేజీల బరువుగల వస్తువులను రవాణా చేసేందుకు డోర్ పికప్, డోర్ డెలివరీ చేసేందుకు సిద్ధమైంది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన షిప్‌మంత్ర యాప్ ద్వారా వినియోగదారులకు సేవలు అందించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్ర వ్యాప్తంగా ఏడు ప్రధాన ప్రాంతాలను గుర్తించి ఏప్రిల్ 23 నుంచి ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. విశాఖపట్నం, విజయవాడ, విజయనగరం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, కాకినాడ, హైదరాబాద్‌లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి.



షిప్‌మంత్ర యాప్

సేవలు పొందాలంటే..

- ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను ఆన్‌లైన్‌లో పొందాలంటే మొదటగా గూగుల్ ప్లేస్టోర్ నుంచి షిప్‌మంత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- వినియోగదారులు 50 కేజీల లోపు వస్తువులను నిర్దేశించిన ఏడు ప్రాంతాల్లో ఎక్కడకు రవాణా చేయాలో నిర్ణయించుకోవాలి.
- షిప్‌మంత్ర యాప్ ద్వారా సరుకు రవాణా చేసేందుకు సరకు ఉన్న ప్రదేశం నుంచి వెళ్లాల్సిన ప్రదేశాన్ని గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.
- వస్తువు బరువును బట్టి ఆన్‌లైన్‌లోనే ధర నిర్ణయిస్తారు.
- ఆ ధరను వినియోగదారుడు చెల్లించిన మూడు గంటల తరువాత వస్తువును పికప్ చేసుకునేందుకు షిప్‌మంత్ర ప్రతినిధులు వస్తారు.
- ఇలా తీసుకువెళ్లిన వస్తువులను 24 గంటల్లోపు డోర్ డెలివరీ చేస్తారు.
- క్యూ వద్దు, క్యూఆర్ ముద్దు నినాదంతో వినియోగదారులకు సేవలు అందించేందుకు సిద్ధమైనట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. వినియోగదారుడు ఆర్టీసీ బస్టాండ్‌కు వస్తువులతో వచ్చి క్యూలో నిలబడి డబ్బులు చెల్లించే అవస్థలు లేకుండా సులభంగా సేవలు అందించే లక్ష్యంతో ఈ విధమైన డిజిటల్ ఏర్పాట్లు చేశామన్నారు.

సమయం ఆదా



షిప్‌మంత్ర యాప్ ద్వారా సమయం ఆదా అవుతుంది. దీనిపై మరింత ప్రచారం చేసేందుకు ప్రయత్నం ప్రారంభించాం. మారిన కాలానికి అనుగుణంగా ఆర్టీసీ అందిస్తున్న డోర్ పికప్, డెలివరీ సేవలను ప్రజలందరికీ అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. సరకు పికప్ చేసుకోవాలంటే మూడు గంటల ముందుగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి.

– షర్మిల అశోక, డీపీటీఓ

వాన పీడ నుంచి పంటను రక్షించుకోండి

- కలెక్టర్ మాధవీలత
- రైతులకు సూచనలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అకాల వర్షాల నేపథ్యంలో పంటల రక్షణకు రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. ఆ వివరాలివీ..

- వరి పైరు పడిపోయి నీట మునిగితే బూజు తెగులు వల్ల గింజ రంగు మారే అవకాశం ఉంటుంది. వర్షాలు తగ్గిన వెంటనే లీటరు నీటికి 1 మిల్లీలీటర్ ప్రోపికోనజోల్ (టిల్ట్/బంపర్/ప్రాపిగార్డ్), 1 గ్రాము కార్బండిజం (బావిస్టిన్/ధనుస్టిన్/బెన్‌ఫిల్/చెన్‌గార్డ్), 2 గ్రాముల కార్బండిజం ప్లస్ మాంకోజబ్ (సాఫ్/సిక్సర్/కంపానియన్) చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.
- కోత కోసిన పనలు వర్షానికి తడిసినట్లయితే గింజ మొలకెత్తకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణం (లీటరు నీటికి 50 గ్రాముల కల్లుప్పు) పనలపై పడే విధంగా పిచికారీ చేయాలి. ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి. పొలంలో నీరు లేకపోతే మడిలోని పనలపై ఉప్పు నీరు జల్లుకోవచ్చు. ఒక వేళ పొలంలో నీరు నిలిచిపోతే పనలను గట్ల పైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం జల్లుకోవాలి.
- వర్షాల వల్ల పనలు తడిస్తే కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పు చల్లుకుంటూ కుప్ప వేయాలి.
- నూర్చిన ధాన్యం రెండు మూడు రోజుల పాటు ఎండబెట్టే వీలు లేకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తడమే కాక, రంగు మారి దుర్వాసన వస్తుంది. దీనిని నివారించడానికి క్వింటాల్ ధాన్యానికి కిలో ఉప్పు, 20 కిలోల పాడి ఊక లేక 4 కిలోల వరి గడ్డి కలిపి ధాన్యం పోగు పెట్టాలి. ఎండ కాసిన తరువాత ధాన్యాన్ని ఎండబెట్టి, తూర్పార బట్టి నిలువ చేయాలి.
- పూర్తిగా తడిసి, రంగు మారిన ధాన్యానికి ధర పూర్తిగా తగ్గిపోతుంది కాబట్టి, ఇటువంటి ధాన్యాన్ని పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంత వరకూ తగ్గించుకోవచ్చు.
- కోత దశలో ఉన్న పైరు, కల్లంలో ఆరబెట్టిన మొక్కజొన్నలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలి. కోత దశలో ఉంటే వెంటనే కోతలు చేపట్టాలి. తడిసిన కండెలను గచ్చుపై పలుచగా పేర్చి ఎండలో బాగా ఆరబెట్టి సాధ్యమైనంత త్వరగా నూర్చాలి. కోత దశకు చేరువలో ఉన్న పంట నేలకు ఒరిగితే పొలంలోని నీటిని పిల్ల కాలువల ద్వారా బయటకు పంపించి, లీటరు నీటికి ప్రోపికొనజోల్ 1 మిల్లీలీటర్, హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి. కళ్లంలో ఆరబెట్టిన మొక్కజొన్న వీలైనంత వరకు తడవకుండా చూడాలి. తడి కండెలపై టార్పాలిన్ కప్పకూడదు. గాలి బాగా తగిలేలా నీడలో ఆరబెట్టుకోవాలి. అవసరాన్ని బట్టి తడిసిన కండెలపై 5 శాతం మెత్తటి ఉప్పు పలుచగా జల్లి, కింద మీద బాగా కలపాలి. దీనివలన మొలక రాకుండా కొంత వరకూ నివారించవచ్చు. కోతకు 10-15 రోజుల సమయం ఉన్న కంకులపై బూజు నివారణకు లీటరు నీటికి ప్రోపికొనజోల్ 25% ఇ.సి 0.5 మిల్లీలీటర్ వంతున కలిపి 7 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. కంకులు ఇంకా పొలంలోనే ఉన్నప్పుడు గింజలు మొలకెత్తకుండా నివారించేందుకు 2% ఉప్పు ద్రావణాన్ని (లీటరు నీటికి 20 గ్రాములు) పిచికారీ చేయాలి. నూర్చిన తరువాత గింజల్లో తేమ 10 - 12 శాతం వచ్చే వరకూ ఎండబెట్టాలి.

ధాన్యం తడిసినా మద్దతు ధరకే కొనుగోలు

- రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లా ప్రత్యేక అధికారి, సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్

రాజానగరం: అకాల వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా రైతుల నుంచి మద్దతు ధరకే కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని జిల్లా ప్రత్యేక అధికారి, సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ తెలిపారు. కొత్త తుంగపాడు ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. అనంతరం కళ్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. వర్షాల కారణంగా అందివచ్చిన పంట దెబ్బ తినడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం దళారుల ప్రమేయం లేకుండా రైతులకు పూర్తి మద్దతు ధర అందించాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఈ ప్రక్రియ క్షేత్రస్థాయిలో ఏవిధంగా అమలవుతోందో తాను పరిశీలిస్తున్నానని చెప్పారు. రబీ ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా, విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

రైతులకు అండగా ప్రభుత్వం



ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి వివేక్ యాదవ్, కలెక్టర్ మాధవీలత

కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ, పొలాల్లో వర్షం నీరు నిలిచిపోకుండా బయటకు పోయేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. తేమ శాతం గురించి బెంబేలు చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. వర్షాలు తెరిపిచ్చిన వెంటనే వరి కోతలు ముమ్మరం చేసి, పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, ఆర్‌డీఓ ఎ.చైత్రవర్షిణి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, పౌరసరఫరాల అధికారి పి.ప్రసాదరావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ వి.నాగార్జునరెడ్డి, ఎంపీడీఓ బి.రామారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా నీట్

57 మంది గైర్హాజరు



కాకినాడలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ ఆదివారం కాకినాడలోని 8 కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 3,373 మంది విద్యార్థులకు గాను 3316 మంది హాజరు కాగా 57 మంది గైర్హాజరయ్యారు. ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నిబంధనల మేరకు ప్రతి విద్యార్థినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి 1.30 గంటల తరువాత విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకూ నిర్వహించారు. కాకినాడలో ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్, విద్యాంజలి, లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్, గ్రీన్‌ఫీల్డ్, అక్షర, శ్రీచైతన్య, సుభానికేతన్, శరణ్య పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. హాల్ టిక్కెట్లలో తల్లి పేరు లేని అభ్యర్థులను పరీక్ష కేంద్రానికి తొలుత అనుమతించలేదు. బయోమెట్రిక్ ద్వారా నిర్ధారణ చేసుకుని వారిని అనుమతించారు. దీనివల్ల సుమారు గంట సమయం వృథా కావడంతో విద్యార్థులు ఆందోళన చెందారు.

చెరువులో పడి మహిళ మృతి




జానకి మృతదేహం

ఉప్పలగుప్తం: ఉపాధి కోసం వలస వచ్చిన కూలీ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా అరకు మండలం బోండాంకి చెందిన బి.జానకి (43), శుక్రా దంపతులు మూడేళ్ల కిందట ఎస్.కొత్తపల్లి గ్రామంలో ఓ రైతు చెరువుల వద్ద మకాం కూలీలుగా చేరారు. ఈ దంపతులు ఇద్దరూ రైతుకు ఉన్న చేపల చెరువు పనితో పాటు ఆవును చూసుకునేవారు. రైతు వేరే ప్రాంతంలో ఉండటంతో పొలంలో బాధ్యత భార్యాభర్తలపై ఉండేది. శనివారం రాత్రి జానకి భర్త శుక్రా బయటకు వెళ్లి మకాం వద్దకు వచ్చేసరికి రైతుకు చెందిన ఆవు కనిపించలేదు. ఆ ఆవును వెతకడానికి భార్యాభర్తలిద్దరూ చెరో పక్కకు వెళ్లారు. ఎంతసేపటికీ భార్య తిరిగి రాకపోవడంతో భర్త శుక్రా పరిసర ప్రాంతాల్లో వెతుక్కుంటూ ఉండగా పక్క రైతుకు చెందిన చెరువులో ఆమె మృతదేహం కనిపించింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రక్తమిద్దాం.. ప్రాణం నిలుపుదాం

- నేడు ప్రపంచ తలసేమియా దినోత్సవం
- వ్యాధిపై అవగాహన అవసరం
- బాధితులకు ప్రభుత్వం రూ.10 వేల సాయం

రాజమహేంద్రవరం రూరల్: తలసేమియా.. ప్రాణాలతో చెలగాటమాడే వ్యాధి. ఇది సోకిన పిల్లలకు జీవితాంతం అవసరమైనప్పుడల్లా రక్తం ఎక్కిస్తూనే ఉండాలి.. లేకుంటే కొద్ది రోజుల్లోనే బాధితులు చనిపోయే ప్రమాదం ఉంది. దేశంలో 3.7 కోట్ల మందికి పైగా ఈ బాధితులు ఉన్నారు. వ్యాధిపై అవగాహన పొందడం ద్వారా పుట్టబోయే పిల్లలు వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. తలసేమియాతో ప్రతి ఏడాదీ వేలాది మంది పిల్లలు జన్మిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. జిల్లాలో తలసేమియా వ్యాధి సోకిన చిన్నారులకు ముందుగా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నారు. ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు బాధితులకు క్రమం తప్పకుండా రక్తం ఉచితంగా ఎక్కిస్తున్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో 300 మందికి పైగా బాధితులు ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో మాత్రం 16 మంది పిల్లలు వైద్య సేవలు పొందుతున్నారు.



ప్రపంచ తలసేమియా దినోత్సవం లోగో

వ్యాధి రావడానికి కారణాలివి

తలసేమియా వ్యాధి జన్యుపరమైంది. ఎముక మూలుగలో హిమోగ్లోబిన్ ఉండే రక్తకణాల ఉత్పత్తి నిలిచిపోవడాన్ని తలసేమియా వ్యాధి అంటారు. ఇది తల్లిదండ్రుల ద్వారా పిల్లలకు సోకుతుంది. తలసేమియా సోకిన వారికి జీవితాంతం రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. మనం పీల్చే ప్రాణవాయువు (ఆక్సిజన్)ను రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు అందించేదే హిమోగ్లోబిన్. తలసేమియా రోగుల్లో శరీరానికి సరిపడా హిమోగ్లోబిన్ ఉత్పత్తి కాదు. ఒకవేళ తయారైనా ఎక్కువ కాలం ఉండదు. హిమోగ్లోబిన్ నిల్వలు తగ్గిన ప్రతిసారీ కృత్రిమంగా రక్తం ద్వారా అందించాలి. సకాలంలో అందించకపోతే ప్రాణాలకే ముప్పు.

వ్యాధి లక్షణాలు

పుట్టిన బిడ్డ మూడు నెలల వయసు నుంచి 18 నెలల వయసులోపే ఈ వ్యాధి బయటపడుతుంది. ముఖం పీక్కుపోవటం, బాల్యంలోనే ముడతలు పడినట్టు తయారవుతుంది. శరీర రంగు తేడాగా ఉండి పాలిపోయినట్టు మారుతుంది. శారీరక ఎదుగుదల ఉండదు. బొడ్డు భాగంలో వాపు ఉంటుంది. తరచూ అనారోగ్యానికి గురవుతారు. బాధితుల్లో అడుగేస్తే ఆయాసం, తీవ్ర స్థాయిలో నీరసం, జీర్ణశక్తి మందగించడం, పొట్టలావు ఎక్కడం, ఎముకల్లో పటుత్వం తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఐరన్ తక్కువగా ఉండాలి. కానీ శరీరంలోకి రక్తం ఎక్కించే సమయంలో ప్రవేశించే ఐరన్ ఓకేచోట కుప్పలా పోగుబడి మూత్రపిండాలు, కాలేయం, గుండె సమస్యలు తలెత్తుతాయి.

కొండంత అండగా ప్రభుత్వం

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తలసేమియా వ్యాధిని ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారు. ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితుల సమస్యలను నివారించేందుకు వారికి కొండంత అండగా నిలిచారు. జిల్లాలో ప్రతి నెలా 53 మంది బాధితులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం పెన్షన్ రూపంలో అందిస్తున్నారు. బాధితులకు అవసరమయ్యే వైద్య సేవలన్నీ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 16 మంది పిల్లలకు వైద్య సేవలందిస్తున్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలో సుమారు 300 మందికి రాజమహేంద్రవరం నగరానికి చెందిన జైన్ సేవా సమితి ఆధ్వర్యంలో పదేళ్లుగా అన్ని రకాల సహకారం అందిస్తున్నారు. జైన్ సేవా సమితి, మేగ్నామదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్, బెంగళూరు సంకల్ప ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం తలసేమియా బాధిత పిల్లలకు రక్త సేకరణతో పాటు ఏడుగురు పిల్లలకు బోన్‌మేరో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించనున్నారు. రక్తం అందించి వారి ప్రాణాలకు భరోసా ఇవ్వాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఉచితంగా వైద్యసేవలు



జిల్లా వ్యాప్తంగా తలసేమియా బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు మందులు ఇస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 53 మంది తలసేమియా బాధితులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10 వేల చొప్పున పెన్షన్ అందించి వారికి ఆరోగ్యపరంగా భరోసా కల్పిస్తున్నారు.

–డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ, తూర్పుగోదావరి

నేడు మెగా రక్తదాన శిబిరం



తలసేమియా బాధితుల కోసం సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు రాజమహేంద్రవరంలోని ఉమారామలింగేశ్వర కల్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నాం. తలసేమియా, సికిల్ సెల్ అనేమియా పిల్లలకు డీఎన్ఏ మ్యూటేషన్ నిర్ధారణ పరీక్షలు, రక్త పరీక్షలు ఉచితంగా చేస్తాం. తలసేమియా బాధిత ఏడుగురు చిన్నారులకు బోన్ మేరో ఆపరేషన్ జరుగుతుంది.

–విక్రమ్‌జైన్, జైన్‌సేవా సమితి నిర్వాహకుడు, రాజమహేంద్రవరం

సీపెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

నల్లజర్ల: విజయవాడలోని భారత ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్, ఇంజినీరింగ్ టెక్నాలజీ (సీపెట్) వారు 2023–24 విద్యా సంవత్సరానికి డిప్లమో, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ విషయాన్ని ఆదివారం ఆ సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడేళ్ల వ్యవధి ఉన్న డిప్లమో ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ, డిప్లమో ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సులకు పదో తరగతి ఉత్తీర్ణత, చదువుతున్న విద్యార్థులు, రెండేళ్ల వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్, టెస్టింగ్ కోర్సుకు బీఎస్సీ ఉత్తీర్ణత, ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులు అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.250, ఓబీసీ, జనరల్ విద్యార్థులకు రూ.500 ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి ఈ నెల 28వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. విజయవాడ, అనంతపురం కేంద్రాలలో ఈ నెల 11న సీపెట్ అడ్మిషన్ టెస్ట్ ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జ్ఞాన భూమి వెబ్‌సైట్ ద్వారా నిబంధనలు అనుసరించి అర్హులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పిస్తామన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. అన్ని కోర్సులకు ప్లాస్టిక్, అనుబంధ సంస్థలలో క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా దేశ, విదేశాలలో ప్లాస్టిక్ వస్తువుల తయారీ, మౌల్డ్ తయారీ, టెస్టింగ్, క్వాలిటీ నిర్ధారణ రంగాలలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కోర్సులలో చేరాలనుకున్న విద్యార్థులు కె.సుందరరావు 93980 50255 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

లోన్ యాప్ వేధింపులకు యువకుడి బలి

కడియం: లోన్ యాప్ ఉచ్చులో చిక్కుకున్న ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కడియం భాస్కర్‌నగర్‌కు చెందిన ఎస్.హరికృష్ణ (18) లోన్ యాప్‌లో కొంత అప్పు తీసుకున్నాడు. రుణం చెల్లింపుల కోసం యాప్ నుంచి వేధింపులు అధికమవ్వడంతో గతంలో కడియం పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో హరికృష్ణ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లోన్ యాప్ వేధింపులతోనే అతడు ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు కడియం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

ఐక్యతతోనే ఆర్యవైశ్యులకు సముచిత స్థానం

- దివంగత మాజీ సీఎం రోశయ్య పేరిట స్మృతి వనం, పోస్టల్ స్టాంప్‌నకు డిమాండ్
- కేంద్రంపై ఒత్తిడికి దశల వారీ కార్యాచరణ
- ఆత్మీయ సమావేశంలో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శివరామ సుబ్రహ్మణ్యం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం



దివంగత మాజీ ముఖ్యమంత్రి రోశయ్య కుటుంబీకులను సత్కరిస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్యులు

సాక్షి, రాజమహేంద్రవరం, సిటీఆర్ఐ: ఐకమత్యంతోనే ఆర్యవైశ్యులకు రాజకీయ రంగంలో సముచిత స్థానం లభిస్తుందని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మంజీరా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఆర్యవైశ్య ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. దీనికి భారీ సంఖ్యలో ఆర్యవైశ్యులు హాజరయ్యారు. సభలో మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్య కుమారుడు కొణిజేటి శివ సుబ్బారావు, అల్లుడు పైడా కృష్ణప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆర్యవైశ్యులంటే కేవలం వ్యాపారాలకే పరిమితమన్న నానుడిని దూరం చేసి, రాజకీయ రంగంలోనూ రాణించగలరన్న కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. మాజీ సీఎం రోశయ్యను ఆదర్శంగా తీసుకుని, ప్రతి ఒక్కరూ రాజకీయాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఆర్యవైశ్యుల ఓట్లు 2.50 లక్షలకు పైగా ఉన్నా.. వారి సంక్షేమాన్ని రాజకీయ పార్టీలు విస్మరిస్తున్నాయని, వారికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ విషయంలో ఆర్యవైశ్యులకు ఎటువంటి కష్టం వచ్చినా అండగా ఉండేందుకు తాను సిద్ధంగా ఉంటానని చెప్పారు. ఆర్యవైశ్యులను అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాల్సిన అవసరం తనకు లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దివంగత మాజీ ముఖ్యమంత్రి రోశయ్య చేసిన కృషిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని శ్రీఘాకోళ్లపు కోరారు. రోశయ్య పేరుతో స్మృతివనం ఏర్పాటు చేసి, అందులో ఆయన నిలువెత్తు కాంస్య విగ్రహం పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయి విద్యా సంస్థలు, ఆరోగ్య, ఆర్థిక సంస్థలకు శాశ్వత ప్రాతిపదికన రోశయ్య పేరు పెట్టాలని, దేశంలో అత్యధికంగా 16 పర్యాయాలు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఉన్న రోశయ్య పేరిట పోస్టల్ స్టాంప్, నాణెం ముద్రించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా పద్మ విభూషణ్ ప్రకటించాలని తీర్మానించారు. డిమాండ్ల సాధనకు దశల వారీగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు. జూన్ 15 తర్వాత కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే కార్యక్రమం మొదలుపెడతామని ప్రకటించారు. ప్రతి నియోజకవర్గంలోనూ 10 వేల ఆర్యవైశ్య ఓటర్లు ఉన్నారని, వారు ఆయా ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని చెప్పారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించి, కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిందిగా కోరుతామని తెలిపారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో లక్షలాది మందితో ఆర్యవైశ్య శంఖారావం నిర్వహిస్తామని శ్రీఘాకోళ్లపు తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ రంగంలో రాణించాలంటే ఎలా వ్యవహరించాలి, ఓటర్ల నమోదు తదితర అంశాలతో కూడిన తీర్మానం చేశారు.

సర్కారీ స్కూళ్ల సత్తా

▶ ఏడవ పేజీ తరువాయి

జిల్లాలోని పలు పాఠశాలలు నూరు శాతం ఫలితాలు సాధించాయి. కపిలేశ్వరపురం మండలం టేకి, ముమ్మిడివరం ఏపీ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, మామిడికుదురు మండలం అప్పనిరాములంక పాఠశాలలు నూరు శాతం ఫలితాలు సాధించాయి. అమలాపురం బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, సమనస, గేదెల్లంక, కుందూరు, మురమళ్ల, వడ్డిచెరువు, కేశనకుర్రు పాఠశాలలు మునుపెన్నడూ లేని రీతిలో ఈసారి 95 శాతం పైగా ఫలితాలు సాధించి రికార్డులు తిరగరాశాయి. ముమ్మిడివరం ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు 71 మంది, అమలాపురం, సమనస బాలుర బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు 58 మంది, కుందూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 30 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. చెల్లుబోయిన యశ్విత (రాజోలు దీవిలోని మోరి పాఠశాల) అత్యధికంగా 588 మార్కులు సాధించింది. కోనాల వెంకట వినయ (తాపేశ్వరం), దంగేటి చైతన్య సత్య పద్మిని (అమలాపురం), ఆకుల అంజని దుర్గాపూర్ణిమ (రాజోలు) 584; పెంటపాటి కనకదుర్గ (మండపేట), సుంకర ఐశ్వర్య (పి.గన్నవరం), మంచెం వీరదుర్గా శ్రావ్య (భీమనపల్లి) 582; చింతపల్లి దేవినాగశ్రీ (బండారులంక) 581 మార్కులతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలిచారు.

ఫలితాలనిచ్చిన ప్రభుత్వ చర్యలు

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ వస్తున్నారు. వాటి ఫలితాలు ఒకటొకటిగా కళ్లకు కడుతున్నాయి. 'మన బడి నాడు – నేడు' మొదటి విడతలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 1,330 పాఠశాలలను రూ.370 కోట్లతో అభివృద్ధి చేశారు. ఈ నిధులతో పాఠశాలల మరమ్మతులు, ఫర్నిచర్, తాగునీరు, గ్రీన్ చాక్‌బోర్డులు, విద్యుదీకరణ, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలు మెరుగుపరిచారు. అలాగే నాడు – నేడు రెండో విడతలో 2,324 పాఠశాలలను రూ.878 కోట్ల అంచనాతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులు చురుకుగా సాగుతున్నాయి.
- ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యంతో గుణాత్మక విద్య అట్టడుగు వర్గాల చెంతకు చేరింది.. చేరుతోంది. ఒకప్పుడు సీట్లు ఖాళీ లేవంటూ కార్పొరేట్ పాఠశాలల్లో «నో వేకెన్సీ» బోర్డులు కనిపించేవి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ఇటువంటి బోర్డులు పెడుతున్న పరిస్థితి కొన్నేళ్లుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సమయంలో కనిపిస్తోంది.
- ప్రభుత్వం పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి.. ముఖ్యంగా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించారు.
- గతంలో కంటే ఇప్పుడు పాఠశాలల్లో పర్యవేక్షణ పెంచారు.
- పలు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఆగస్టు నుంచే ప్రత్యేక తరగతులు ఆరంభించారు.
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు సబ్జెక్టు నిపుణులతో స్టడీ మెటీరియల్ తయారు చేయించి, సకాలంలో అందజేశారు.
- డిసెంబర్ నుంచే ఉదయం, సాయంత్రం టెన్త్ విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించారు.
- ప్రతి రోజూ సబ్జెక్టుల వారీగా స్లిప్ టెస్టులు నిర్వహించారు. వెనుకబడిన విద్యార్థులపై ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకున్నారు.
- గతానికి భిన్నంగా గత విద్యా సంవత్సరం నుంచే మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా టెన్త్ పరీక్షలు నిర్వహించారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

పిఠాపురం: చేబ్రోలులో విద్యుత్ షాక్ తగిలి ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందినట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలం రాచపల్లికి చెందిన అల్లం రాజ్‌కుమార్ భవన నిర్మాణాల్లో స్లాబ్‌లు వేసే పనిలో లిఫ్ట్ ఆపరేటర్‌గా చేస్తున్నాడు. ఆదివారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఓ ఇంటికి రెండో అంతస్తు స్లాబ్ వేస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు లిఫ్ట్‌కు తగిలి రాజ్‌కుమార్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అక్కడికక్కడే పడిపోయాడు. అతనిని ఇతర కూలీలు ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

- కారు, ఆటోలను ఢీకొన్న లారీ
- అక్కడికక్కడే ఇద్దరు మృతి
- నాన్నమ్మ పెదకార్యానికి వెళ్లొస్తూ ఒకరు, ఆటో డ్రైవర్ మరొకరు



కాలువలో పడిన ఆటో, గ్యాస్ సిలిండర్ల లోడు లారీ



ఆటో డ్రైవర్ కాలిబోయిన నాని (పాత చిత్రం)



ప్రగడ శ్రీనివాస్ (పాతచిత్రం)

తుని రూరల్: లారీ మృత్యువు రూపంలో దూసుకొచ్చింది.. ఇద్దరిని బలిగొంది.. ఆయా కుటుంబాల్లో విషాదాన్ని నింపింది.. జాతీయ రహదారిపై వెళుతున్న కారు, ఆటోపైకి ఖాళీ గ్యాస్ సిలిండర్ల లోడు లారీ దూసుకుపోవడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. శనివారం అర్ధరాత్రి తుని మండలం తేటగుంట శివారు రాజులకొత్తూరు సమీపంలో ఈ సంఘటన జరిగింది. ఇందులో లోవకొత్తూరుకు చెందిన ఆటో డ్రైవర్ కాలిబోయిన నాని (21), కాకినాడ రూరల్ వాకలపూడికి చెందిన ప్రగడ శ్రీనివాస్ (34) అక్కడికక్కడే మృతి చెందారు. తుని రూరల్ ఎస్సై ఎ.బాలాజీ తెలిపిన కథనం ప్రకారం... లోవకొత్తూరు నుంచి డ్రైవర్ నాని తన ఆటోను నడుపుకొంటూ అన్నవరం వైపు వస్తున్నాడు. ప్రగడ శ్రీనివాస్ కారులో అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పెంటకోట నుంచి వాకలపూడి గ్రామానికి వెళ్తున్నారు. రాజులకొత్తూరు సమీపంలో ఈ కారు, ఆటో ఒకదాని వెనుక మరొకటి వెళ్తున్నాయి. అదే మార్గంలో ఖాళీ గ్యాస్ సిలిండర్ల లోడుతో వేగంగా వెళుతున్న లారీ కారును, ఆటోను ఢీకొంది. దీంతో కారు, ఆటో హైవే పక్కనే ఉన్న పది అడుగుల బంటా (కాలువ)లో పడిపోగా వాటిపై సిలెండర్ల లోడు లారీ పడింది. దీంతో కారును నడుపుతున్న శ్రీనివాస్, ఆటోను నడుపుతున్న నాని వాహనాల కింద చిక్కుకుపోయారు. సమాచారం తెలియడంతో రూరల్ ఎస్సై బాలాజీ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. గంటన్నరకు పైగా శ్రమించి క్రేన్‌తో లారీ, కారు, ఆటోలను వేరు చేశారు. అప్పటికే శ్రీనివాస్, నానీలు మృతి చెందడంతో మృతదేహాలను బయటకు వెలికి తీశారు. కారు, ఆటో నుజ్జునుజ్జయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని ఎస్సై బాలాజీ వివరించారు.

నాన్నమ్మ మృతి చెందడంతో..

పెంటకోటకు చెందిన ప్రగడ శ్రీనివాస్ బిల్డర్ కావడంతో వృత్తిరీత్యా కాకినాడ రూరల్ వాకలపూడిలో తన భార్య, కుమార్తె, కుమారుడితో నివాసం ఉంటున్నాడు. ఇటీవల తన నాన్నమ్మ మృతి చెందగా శనివారం జరిగిన పెదకార్యానికి భార్య, పిల్లలతో శ్రీనివాస్ వెళ్లాడు. ఆదివారం హోమం చేయాల్సి ఉండడంతో భార్య, పిల్లలను పెంటకోటలో ఉంచి శ్రీనివాస్ కారును తీసుకుని వాకలపూడి బయలు దేరాడు. ఈ క్రమంలో జరిగిన ప్రమాదంలో అతని మృతితో భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

ఒంటరైన తల్లి

లోవకొత్తూరుకు చెందిన కాలిబోయిన లోవరాజు, సత్యవతి దంపతులకు కుమారుడు నాని, కుమార్తె సంతానం. కుమార్తెకు కొన్నేళ్ల కిందట వివాహం కాగా లోవరాజు ఐదేళ్ల కిందట మరణించాడు. తల్లి సత్యవతితో కలసి నాని జీవిస్తున్నాడు. ఏడాదిన్నర కిందట బావ ఆటో కొనివ్వడంతో నాని ఆటోను నడుపుతూ వచ్చిన ఆదాయంతో తల్లిని పోషించుకుంటున్నాడు. అలా జీవనోపాధికి ఆటో నడుపుతూ నాని ప్రమాదానికి గురై మృతి చెందడంతో తల్లి సత్యవతి ఒంటరయ్యింది. ఎంతో అనుకువగా ఉంటూ తన తల్లిని పోషిస్తున్న నాని మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

భార్య, బిడ్డలను చూడకుండానే..



మృతుడు అజయ్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగి మృతి

రాజానగరం: అత్తారింట్లో ఉన్న భార్య, పాపలను చూసి వద్దామని బైక్‌పై బయలు దేరిన బ్యాంకు ఉద్యోగిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి గామన్ బ్రిడ్జి రోడ్డుపై ఆటోనగర్ వద్ద ఆదివారం ఈ ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించి ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం బొబ్బిల్లంకకు చెందిన చిట్టూరి అజయ్ (33) సీతానగరం ఎస్‌బీఐలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. అతనికి రెండేళ్ల కిందట వివాహమైంది. 4 నెలల పాప కూడా ఉంది. ఈ క్రమంలో పెదపూడి మండలం కడకుదురులో అత్తారింటి వద్ద ఉన్న భార్య, పాపలను చూసి వద్దామని ఆదివారం ఉదయం ఇంటి నుంచి బైకుపై బయలు దేరాడు. గామన్ బ్రిడ్జిపై వెళ్తున్న అతను ఆటోనగర్ సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొని అతని పైనుంచి వెళ్లిపోయింది. దీంతో శరీరంతో పాటు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్సై సుధాకర్ తెలిపారు. వాహనం తలపై నుంచి వెళ్లడంతో ఆ ప్రాంతమంతా రక్తపు మడుగులా మారింది.

కష్టాలు తీరేవేళ..: ఇద్దరు బిడ్డలు అందివచ్చారు.. కష్టాలు తీరిపోతాయనుకుంటున్న తరుణంలో రోడ్డు ప్రమాదంలో ఇలా జరిగిందంటూ పెద్ద కుమారుడిని కోల్పోయిన ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి తండ్రి బాపన్నకు 10 సెంట్ల భూమి ఉంది. కొంతకాలం కౌలు రైతుగా పనిచేసిన ఆయన వృద్ధాప్యంతో వ్యవసాయం చేయడం లేదు. ఇద్దరు మగ సంతానంలో ఒకరు ఎస్‌బీఐలో, మరొకరు కాటవరం ఆంధ్రా బ్యాంకులో పనిచేస్తున్నారు. అజయ్ మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

గోదావరిలో దూకి యువకుడి గల్లంతు

కొవ్వూరు: జిల్లాలోని గోకవరంలోని రామన్నదొర వీధికి చెందిన వెదుళ్ల వీరబాబు (30) ఆదివారం మధ్యాహ్నం గామన్ ఇండియా బ్రిడ్జిపై నుంచి గోదావరి నదిలోకి దూకేశాడు. అతడిని వెతుక్కుంటూ అదే సమయంలో అతడి సోదరులు అక్కడకు చేరుకుంటున్నారు. వారు దూకవద్దని కొద్ది దూరంలో నుంచి వారిస్తుండగానే వీరబాబు గోదావరి నదిలోకి దూకేసినట్టు పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ తెలిపారు. గల్లంతైన వీరబాబు ఆచూకీ కోసం నదిలో ముమ్మరంగా గాలిస్తున్నారు. తాగిన మత్తులో గతంలోను పలుమార్లు ఇలా భయపెట్టేవాడని వీరబాబు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. వీరబాబుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తాపీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. హనుమంతు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుర్గా ప్రసాద్ తెలిపారు.